


భోగి వేడుకల్లో పొంగల్ వండుతున్న హీరోయిన్లు ప్రేమ, రాగిణి ద్వివేది

సంక్రాంతి లక్ష్మికి స్వాగతం





- నేడు మకరసంక్రాంతి
- రాష్ట్రవ్యాప్తంగా సంబరాలకు సిద్ధం

బెంగళూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలకడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధమయ్యారు. అన్నదాతలు పండించిన పంటలతో ప్రత్యేక వంటకాలతో పాటు ఆటపాటలతో సరదాగా జరుపుకునే సంక్రాంతి పండుగకు రాష్ట్రమంతటా సంబరాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం బెంగళూరుతో పాటు కోలార్, చిక్కబళ్ళాపుర, రాయచూరు, బళ్ళారి ప్రాంతాల్లో భోగిమంటలు వేశారు. ఇక సోమవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ ఆలయాలలో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. మైసూరు చాముండేశ్వరి, ఉడుపి శ్రీకృష్ణమఠం, ధర్మస్థళ మంజునాథస్వామి, శృంగేరి శారదాదేవి, మంగళూరులోని ఖాద్రి మంజునాథ ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుపుతున్నట్లు ప్రకటించారు. సంక్రాంతి రోజున పల్లెల్లో ఏడాది పాటు పొలం పనులలో రైతుతో పాటు సమానంగా పనిచేసిన ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తారు. చామరాజనగర్‌తో పాటు పలుచోట్ల ఎడ్లబండ్ల పోటీలు సాగనున్నాయి. హిందువులు జరుపుకునే ప్రముఖమైన పండుగలలో సంక్రాంతికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ప్రతి ఇంటి ముందు ముగ్గులు వేయడం, హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శనలు ఉంటాయి. ప్రాంతాల వారీగా పాండురంగస్వామిని ఊరేగించే సంప్రదాయం కూడా ఉంది. ముఖ్యంగా పల్లెల్లో సంప్రదాయాలు కొనసాగుతున్నాయి.



చెరకు గడలు కొనుగోలు చేస్తున్న యువతులు

గవిగంగాధర ఆలయంలో సూర్యకిరణాల వీక్షణకు ఏర్పాట్లు

బెంగళూరులో ప్రాచీన ఆలయాలలో ఒకటైన గవిగంగాధరేశ్వర ఆలయంలో ఏటా సంక్రాంతి రోజున ప్రత్యేకత చోటు చేసుకోనుంది. పండుగ రోజు సాయంత్రం సూర్యకిరనాలు నంది విగ్రహం మీదుగా గంగాధరేశ్వర విగ్రహాన్ని తాకుతాయి. అద్భుతమైన ఈసందర్భాన్ని చూసేందుకు పెద్దఎత్తున భక్తులు హాజరవుతారు. భక్తుల సందర్శనార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.



నిత్యావసరాలు కొనుగోలు చేస్తూ...

కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట

పండుగ కోసం ప్రత్యేకంగా వండుకునేందుకు అవసరమైన వస్తువుల కొనుగోళ్ళతో మార్కెట్‌లు కిటకిటలాడాయి. ప్రత్యేకించి అనపకాయ, చెరుకుగడలు, చిలగడదుంపలు భారీగా అమ్ముడుపోయాయి. అనపకాయ కేజీ రూ.60-80 పలుకగా చెరుకుగడలు ఒకటికి రూ.50-100 దాకా అమ్ముడుపోయాయి. వేరుశెనగ కాయలు, చిలగడదుంపలు, రేగుపళ్ళు ధరలు సాధారణంగానే ఉన్నాయి. సంక్రాంతికి నువ్వులు, బెల్లం, కొబ్బరితో తయారు చేసే వస్తువులను ఒకరినొకరు పంచుకుని సదా స్నేహ భావంతో ఉందామని చెప్పుకునే సంప్రదాయం ఉంది. ఇక ఉత్తరకర్ణాటక ప్రాంతాలలో వివిధరూపాలలో దేవుళ్ళను, ఇతరత్రా చక్కెర అచ్చులతో తయారు చేసి వాటిని పంపిణీ చేసే విధానం అనాదిగా వస్తోంది. ఇందుకోసం ఉత్తరకర్ణాటక జిల్లాలో నెలరోజులుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. పండుగకు అవసరమైన వస్తువుల వ్యాపారాలు జోరుగా సాగాయి.

సంక్రాంతి సంప్రదాయాలు పాటించాలి

- నందనలో సంబరాల ప్రారంభంలో తారాఅనురాధ

బెంగళూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలు ప్రతి ఒక్కరూ పాటించాలని ప్రముఖ నటి తారా అనురాధ అభిప్రాయపడ్డారు. ఆంధ్రాశైలి రుచులకు పేరొందిన నందనా ప్యాలెస్ కోరమంగళ శాఖలో ఆదివారం సంప్రదాయ సంక్రాంతి సంబరాలను తార లాంఛనంగా ఆరంభించారు. నందనా గ్రూపు హోటల్స్ యజమాని డాక్టర్ ఆర్ రవిచందర్‌తో పాటు కుటుంబసభ్యులు గోపూజ జరిపారు. ఇదే సందర్భంగా తార అనురాధ మాట్లాడుతూ రైతు పండించిన కొత్తపంటలు ఇంటికి తీసుకువచ్చి తొలిసారి వివిధ వంటకాలతో జరుపుకునే వేడుక సంక్రాంతి అన్నారు. ఇంటిముందు ము గ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులతో ఒకప్పుడు సందడిగా ఉండేదని గుర్తుచేసుకున్నారు. కాలం మారుతున్నా సంప్రదాయాలు పా టించాలని పిలుపునిచ్చారు. నందన నమ్మకానికి, రుచులకు పెట్టింది పేరని కొనియాడారు. హోటల్స్ యజమాని రవిచందర్ మాట్లాడుతూ దక్షిణభారత్‌లోని అన్ని ప్రాంతాల్లోనూ వినియోగదారులు ఆశించేలా నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నందన హోటల్స్‌లో ఈనెల 21వరకూ సంక్రాంతి ప్రత్యేక వంటకాలు ఆఫర్‌లతో అందిస్తున్నామన్నారు. నందన అంటే తెలుగు రుచులతో దేశవిదేశీయులు సైతం సం తృప్తికరంగా అనుభూతితో ఆస్వాదించే వంటకాల కేంద్రాలుగా రాణిస్తున్నాయన్నారు. శాఖాహార, మాంసాహారంలో భిన్నమైన రుచులు సంక్రాంతి కానుకగా అందిస్తున్నట్లు తెలిపారు. మశ్రూంతో పాటు చికెన్, మటన్, చేపలతో వంటకాలు సిద్ధమని ఆస్వాదించాలని పిలుపునిచ్చారు.



గోపూజ చేస్తున్న తారాఅనురాధ, రవిచందర్ తదితరులు

భోగి సంబరాల్లో సినీతారలు

బెంగళూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే సంక్రాంతి సంబరాల్లో పాలుపంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని సినీ హీరోయిన్లు ప్రేమ, రాగిణి ద్వివేది పేర్కొన్నారు. బెంగళూరు కాక్స్‌టౌన్‌లోని గంగమ్మదేవస్థానంలో ఆదివారం పౌరకార్మికుల సమక్షంలో జరిగిన భోగి వేడుకల్లో వారు పాల్గొన్నారు. తొలుత సంప్రదాయ బద్ధంగా గోపూజ నిర్వహించారు. పౌరకార్మికులతో కలిసి సంక్రాంతిని అర్థవంతంగా నిర్వహిస్తున్న భారతి నగర్ రెసిడెంట్స్ ఫోరం అధ్యక్షుడు ఎన్‌ఎస్.రవిని వారు ప్రత్యేకంగా అభినందించారు. పలు రకాల సమాజ సేవలను నిర్వహిస్తూ ఎందరికో ఆయన ఆదర్శప్రాయంగా ఉన్నారన్నారు. ఇదే సందర్భంగా పౌరకార్మికులకు నటీమణులు నూతన వస్త్రాలను బహూకరించారు. నగరంలో పౌర కార్మికులు సేవలు మరువలేనివని, వారిని ఎంత ఘనంగా సత్కరించినా వారి సేవలకు సరికావన్నారు. నగర వీధులను పరిశుభ్రం చేయడంతో పాటు, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వారితో కలిసి పొంగల్ వండారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.95	1,621.41
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	9,940
సామర్థ్యం (టీఎంసీలు)	10.17	65.37

హంపీ ఉత్సవాలకు సర్వం సిద్ధం



హంపీ ఉత్సవాల లోగో

కంప్లి, జనవరి 14 : ఫిబ్రవరి 2, 3, 4 తేదీలలో జరగనున్న హంపీ ఉత్సవాల కోసం పలుచోట్ల ప్రధాన వేదికలను సిద్దం చేస్తున్నారు. జిల్లా అధికారులు ఆయా శాఖల అధికారులతో చర్చలు జరుపుతూ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. జిల్లా అధికారి ఎంఎస్ దివాకర్ వివిధ శాఖలవారితో చర్చించి ఉత్సవాలకు అన్నీ సిద్దం చేస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఇన్‌ఛార్జ్ మంత్రి జమీల్ అహ్మద్ చేతుల మీదుగా హంపీ ఉత్సవాల లోగోను కూడా ఆవిష్కరించారు.

హొసపేట, జనవరి 14: మకర సంక్రాంతి సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హంపీ కట్టడాలను చూసేందుకు జనం పోటెత్తారు. మెదటి సారిగా పురావస్తు శాఖ పర్యాటకుల సౌకర్యార్థం స్వచ్ఛమైన తాగు నీరు, శాకాహార రెస్టారెంట్లను ప్రారంభించింది. దీంతో పర్యాటకుల సంఖ్య పెరిగింది. జిల్లాకలెక్టర్ దివాకర్ హంపీలోని విజయ విఠల దేవాలయం సమీపంలో స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని వారికి మార్గనిర్దేశనం చేశారు. అక్రమంగా ఉగ్రనరసింహ, లోటస్ మహల్ సమీపంలో నడుస్తున్న మూడు రెస్టారెంట్లను తొలగించారు. వాహనాల పార్కింగ్ ప్రాంతంలో కొత్త రెస్టారెంట్లను నిర్వహించేందుకు ఏఎస్ఐ విభాగం అనుమతులు ఇవ్వడంతో పర్యాటకులు బారులుతీరుతున్నారు.

అయ్యప్ప స్వామి సేవలో ఎమ్మెల్యే



అయ్యప్పను దర్శించుకున్న ఎమ్మెల్యే నాగరాజు

సిరుగుప్ప, జనవరి 14 : ఎమ్మెల్యే బీఎం నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం అయ్యప్ప స్వామి దర్శనం చేసుకున్నారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని ప్రత్యేకంగా ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వామి వారికి పూజలు జరిపించారు. సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయంలో దీపాలంకార సేవలు జరుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కేరళలో సోమవారం మకర జ్యోతి దర్శనం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు బీఎం సతీష్, కొడ్లి మల్లికార్జున, వెంకటేష్, గణేష్ తదితరులు ఉన్నారు.


అక్రమంగా ఎర్రమట్టి తరలింపు



ఎర్రమట్టి తీసుకువెళుతున్న లారీ

సిరుగుప్ప, జనవరి 14: సిరుగుప్ప తాలుకాలో ఎర్ర మట్టి అక్రమంగా రవాణా జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. తాలుకాలోని ఆదోని రోడ్డు మార్గంలో రారావి, బంద్రాల్, అగసనూరు, నాడంగ, తదితర ప్రాంతాల్లో రాత్రిపగలు అనే తేడాలేకుండా అక్రమ ఎర్రమట్టి రవాణా జరుగుతోంది. గనుల శాఖ ఒకచోట అనుమతి ఇచ్చి వుంటే దానిపై పది చోట్ల తవ్వకాలు జరుపుతున్నారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. జిల్లా అధికారి ఈ విషయంపై దృష్టి సారించి ఎర్రమట్టి అక్రమ రవాణా జరుగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మకరరాశికి మార్తాండుడు వస్తున్న వేళ..



కంప్లిలో భోగి మంటలు వేసిన రైతులు

తెలుగు క్యాంపుల్లో ఇళ్ల ముందు భోగి ముగ్గులు వేస్తున్న మహిళలు

కోతలు పూర్తి కావడంతో పొలంలో మకాం వేసిన ఆవులు

గోవు మాలక్ష్మికి కోటి దండాలు

సత్యనారాయణపేటలో రంగోలి

రాష్ట్ర ప్రజలు ఎప్పుడెప్పుడూ అని ఎదురుచూస్తున్న సంక్రాంతి రానే వచ్చింది. బళ్లారి తాలుకాలోని తెలుగు క్యాంపుల్లో సంక్రాంతి భోగి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆదివారం భోగి పండుగను జరుపుకున్న ప్రజలు సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ జరుపుకోడానికి సిద్ధమయ్యారు. రైతులు తమకు పొలం పనుల్లో సహకరిస్తున్న పశువులు, ఎద్దులతో కలసి సంక్రాంతి పర్వదినాన సూర్యభగవానుడికి పొంగలి నైవేద్యం పెట్టి, పూజలు చేసి మొక్కులు తీర్చుకోనున్నారు. మరోవైపు యువత ఆటపాటలతో వివిధ రకాల్లో పోటీల్లో పాల్గొని సరదాగా గడిపేందుకు సిద్ధమయ్యారు. కనుమ రోజున పశువులను అందంగా తీర్చిదిద్దేందుకు రైతులు అలంకరణ సామగ్రిని కూడా సిద్ధం చేసుకున్నారు. బళ్లారి నగరంలో పలువురు ఆదివారం ఉదయాన్నే భోగిమంటలు వేసి భోగి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగరంలోని సత్యనారాయణపేటలో మహిళలు ఇళ్లముందు రంగురంగుల ముగ్గులు వేశారు. నిత్యం ఛుడీదార్, జీన్స్‌ప్యాంట్ టీషర్టులతో కనబడే యువతులు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సంసృతి సాంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా నేతచీరల్లో సంప్రదాయ ఆభరణాలతో కనిపించారు. యువతుల తళుకుబెళుకులతో వీధులు కొత్త కళను సంతరించుకున్నాయి. కంప్లి, సిరుగుప్పలలో భోగి సందర్భంగా భోగి మంటలు వేసుకుని సంబరాలను జరుపుకున్నారు. ✍ బళ్లారి సిటీ, రూరల్, కంప్లి

విరగ్గాసిన మల్లిగెనాడు యాపిల్!

- విజయగనగర జిల్లాలో కొత్త పంటకు రైతు శ్రీకారం
- అంతరపంటగా యాపిల్ సాగుతో రైతుల ఆర్థికాభివృద్ధి

బళ్లారి గాంధీనగర్, జనవరి 14: హిమగిరుల ప్రాంతాలకే పరిమితమైన కాశ్మీరీ యాపిల్ సాగు నేడు బయలు సీమ మల్లిగె నాడుకు కూడా విస్తరించింది. ఈ ప్రాంతంలో విరివిగా యాపిల్ సాగుచేస్తూ ఔరా అనిపించుకున్నాడు ఓ రైతు. విజయగనర జిల్లా పరిధిలోని హూవినహడగలి పట్టణానికి చెందిన రైతు, పుర సభ మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.తిమ్మణ్ణ తన తోటలో ప్రయోగాత్మకంగా యాపిల్ సాగు ప్రారంభించాడు. రెండు ఎకరాల్లో అంతర పంటగా యాపిల్ మొక్కలను నాటారు. మూడు సంవత్సరాల క్రింత నాటిన యాపిల్ మొక్కలు నేడు ఏపుగా పెరిగి పండ్లు విరగగాసాయి. 2021లో మొక్కకు రూ 250 వంతున 400 మొక్కలను తీసుకొచ్చి థైవాన్ పింక్ జామ మొక్కల మధ్య నాటారు. గోమూత్రం, బెల్లం, సెనగ పిండితో జీవామృతం తయారు చేసి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ప్రతి మొక్కకు నేరుగా అందించారు. ఈ రకమైన సేంద్రీయ వ్యవసాయం ద్వారా జామ, ఆపిల్ విరగ గాయడంతో ఏటా రూ.2 లక్షల ఆదాయం రైతు అందుకుంటున్నాడు. అత్యంత ఉష్ణప్రాంతమైన హూవినహడగలి లాంటి ప్రాంతంలో యాపిల్ సాగు చేయడం అంత్యంత సాహసోపేతమైన పనే. అయినా ఉద్యానవన శాఖ అధికారులు సలహాలు సూచనలతో అవసరమైన కృత్రిమ వాతావరణం కల్పించడంతో నేడ యాపిల్ పండ్లు విరగకాస్తున్నాయి. దీంతో చుట్టు ప్రక్కల ప్రాంతాలకు చెందిన పలువురు ఆసక్తి కలిగిన రైతులు వచ్చి యాపిల్ పండ్ల చెట్లను వీక్షిస్తున్నారు.

కొన్నేళ్లుగా ఈప్రాంతం మల్లెపూల సాగుకు పేరుగాంచడంతో ఈ ప్రాంతం మల్లిగెనాడుగా పేరు గాంచింది. మల్లెపూల సాగుకు పేరు గాంచిన హూవినహడగలి తాలూకా రైతులు వక్క, యాపిల్, డ్రాగన్‌ఫ్రూట్ లాంటి పంటలు సాగు చేస్తూ వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందించి మరింతగా ప్రోత్సహించాలని తాలూకా రైతులు కోరుతున్నారు.



యాపిల్ పండ్ల సాగు చేసిన ఎస్.తిమ్మణ్ణ

కాంగ్రెస్ పదాధికారుల నియామకం



వీరాంజనేయులు, హబీబ్ రెహ్మాన్‌కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

కంప్లి, జనవరి 14 : కాంగ్రెస్ పార్టీ కర్ణాటక కాంగ్రెస్ సమితి జిల్లా గ్రామీణ విభాగం ఎస్సీ మోర్చా అధ్యక్షులుగా వీరాంజనేయులు, సోషల్ మీడియా (సామాజిక జాలాతరణ) విభాగం జిల్లా అధ్యక్షులుగా ఎం హబీబ్ రెహ్మాన్ నియమితులయ్యారు. వారికి ఈ ఆదివారం ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తమ కార్యాలయంలో అర్హత పత్రాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ నాయకుడు సిద్దరామయ్య, డీకే శివకుమార్, జిల్లా అధ్యక్షులు శివయోగి తమను గుర్తించారన్నారు. అనంతరం వీరాంజనేయులు, హబీబ్ రెహ్మాన్ మాట్లాడుతూ ఎన్నికలలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు నాంది పలుకుతామన్నారు. వారితో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, చెన్న బసవరాజు, లడ్డూ వన్నూరువలీ, ఉస్మాన్, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



సత్యనారాయణ పేటలో శ్రీరామ అక్షింతలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కంప్లి, జనవరి 14 : అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను కంప్లి పట్టణంలో ఆదివారం ప్రతి ఇంటికి బీజేపీ, విశ్వహిందూపరిషత్ సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22న శ్రీరామ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతి ఇంట ఉత్తర దిక్కున దీపాలను వెలిగించాలని కోరారు. అక్షింతలతో పాటు ప్రసాదాలు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రమేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

బళ్లారి గాంధీనగర్, జనవరి 14: నగరంలో రాయల్ సర్కిల్ నుండి ఏపీఎంసి సర్కిల్ వరకు మోతి సర్కిల్ నుండి కనేకల్లు బస్టాండు వరకు గల రోడ్లలో ద్విచక్ర వాహనాలు మినహా, మిగిలిన అన్ని రకాలైన వాహనాల సంచారాన్ని ఉదయం 7గంటల నుండి రాత్రి 10గంటల వరకు నిలిపివేస్తున్నట్లు జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆదేశాల జారీ చేశారు. సంక్రాంతి పండుగ ఒక రోజు ముందు బెంగళూరు రోడ్డులో ద్విచక్ర వాహనాలు తిరగడానికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రజలు ఈ ఆదేశాలను తప్పకుండా పాటించాలని సూచించారు.

మహిళ ఆత్మహత్య

బళ్లారిరూరల్, జనవరి 14 : తాలుకాలోని వీరాపురం గ్రామానికి చెందిన వన్నూరుస్వామి భార్య దేవమ్మ (45) ఇంటి పైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పీడీ హళ్లి పోలీసులు తెలిపారు. భర్త తాగుడుకు బానిసై ప్రతి నిత్యం ఇంట్లో గొడవలు జరుగుతుండటంతో మనస్థాపంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో శనివారం రాత్రి ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు వున్నట్లు తెలిపారు.

హోసూరు జోన్

సంక్రాంతి కానుకల పంపిణీ



పూనపల్లి పంచాయతీలో సంక్రాంతి కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.ప్రకాశ్

హోసూరు జనవరి 14 : హోసూరు సమీపంలోని పూనపల్లిలో సంక్రాంతి ప్యాకేజీ పంపిణీ కార్యక్రమం జరిగింది, హోసూరు యూనియన్ పూనపల్లి పంచాయతీలో కుటుంబ కార్డుదారులకు ప్రభుత్వం తరపున సంక్రాంతి పండుగకు రూ.1000, సంక్రాంతిప్యాకేజీ వంట సరకులు హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్ పంపిణీ చేశారు, పూనపల్లి పంచాయతీ చైర్ పర్సన్ సావిత్రమ్మ, డిప్యూటీ చైర్ పర్సన్ నేత్రావతి, డీఎంకే నిర్వాహకులు మంజునాథప్ప, జగదీశ్, కృష్ణప్ప, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పొగమంచుతో వాహనదారుల ఇబ్బందులు

హోసూరు(మత్తిగిరి) జనవరి 14 : హోసూరు ప్రాంతంలో మంచు కురుస్తుండటంతో జాతీయ రహదారిపై వాహనాలు హెడ్‌లైట్లు వెలిగిస్తూ సాగిపోతున్నాయి. హోసూరు పరిసర ప్రాంతాల్లో ఉదయం నుంచి మంచు కురుస్తోంది. బెంగళూరుల్లోని కృష్ణగిరి జాతీయ రహదారి, రాష్ట్ర రహదారులపె వాహనాలు చాలా కష్టంతో ముందుకు సాగుతున్నాయి, తెల్ల వారుజామున రోడ్లలో వాకింగ్ వెళ్లేవారు కూడా భయపడుతున్నారు, ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు ఏమీ తెలియడం లేదు. మంచు అలా కళ్లకు అడ్డంగా కురుస్తుండడంతో వాహనదార్లు, రోడ్లలో నడిచే బాటసార్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పోలీస్ అధికారులకు సంక్రాంతి పోటీలు

హోసూరు జనవరి 14 : హోసూరులో సమత్వ పొంగల్ (సంక్రాంతి) పండుగను నిర్వహించారు, సంక్రాంతి సంబరాలు చేసుకుంటూ హోసూరులో పోలీసులకు ఆటల పోటీలను నిర్వహించారు, ఈ పోటీల్లో పోలీసులకు ఉట్టి కొట్టే పోటీలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో హోసూరు ప్రాంతంలో మత్తిగిరి, బాగలూరు, సిప్‌కాట్, హడ్కో పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి సూర్యుడికి మట్టి కుండల్లో పొంగల్ సమర్పించారు. సూర్యునికి పూజలు చేసి అనంతరం అందరికి పొంగల్ వడ్డించారు, అనంతరం పోలీసులకు ఆటల పోలీసులు నిర్వహించారు, మ్యూజిక్ చైర్, ముగ్గుల పోటీలు, నిర్వహించారు, ఈ కార్యక్రమానికి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తంగదురై హాజరై పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు, ఈ కార్యక్రమంల్లో డీఎస్పీ శివలింగం, ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, ప్రకాశ్, శరవణన్, పద్మావతి, రాణి తదితరులు పాల్గొన్నారు. తమిళనాడుల్లో ఈ పండుగను వారం రోజుపాటు జరుపుకుంటూ విశేషంగా కొనియాడుతుంటారు. ఈ పండుగ సందర్భంగా (తై పొరందాల్ వళి పొరకుం) అనే అంశాన్ని తీసుకుంటూ పూజల కార్యక్రమాలు, తమిళులు ప్రారంభిస్తారు, ఈ సంక్రాంతి పండుగకు ఎక్కడ ఉన్న ప్రజలు కూడా వారి వారి స్వగ్రామాలకు విచ్చేసీ వారి బంధువులతో కలిసి జరుపుకుంటారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

రాయచూరు, జనవరి 14: జిల్లాలోని సింధనూరు తాలూకా తుర్విహాళ్ వద్ద శనివారం రాత్రి జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన తుర్విహాళ్ పట్టణానికి చెందిన హనుమంతు(45) ఉమలూటి గ్రామానికి చెందిన ప్రదీప్(27)లు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలుకాగా వారిని మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన తుర్విహాళ్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా సింధనూరు నుంచి హెమ్మెడగకు వెళ్లె రోడ్డును విస్తరించేందుకు రూ.4 కోట్ల అంచనాతో చేపట్టిన పనులు మందగతిలో సాగుతుండడమే ఈ ప్రమాదాలకు కారణంగా తెలిసింది. గతంలోను రెండుమూడు సార్లు ఇలాంటి ప్రమాదాలే జరగగా ఇప్పటికే ఇద్దరు మృత్యుపాలయ్యారు. అనేక మంది వాహనదారులు ఈ మార్గంలో సంచరిస్తు ప్రమాదాలకు గురి అవుతుండడం నిత్యకృత్యంగా మారిందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్ట్ దక్కించుకున్న గుత్తేదారు 9 నెలల్లోగా రోడ్డు పని పూర్తి చేయాల్సి ఉండగా ఏడాదిన్నర దాటినా ఇప్పటికి పనులు చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నగరంలో మంత్రి భోసరాజు విస్తృత పర్యటన

రాయచూరు, జనవరి 14 : రాష్ట్ర చిన్ననీటి పారుదల సైన్స్ అండ్ టెక్నాలజి శాఖల మంత్రి ఎన్.ఎస్.భోసరాజు ఆదివారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. నేతాజినగర్‌లో పాతబడిన ప్రైమరీ స్కూల్‌ను పరిశీలించిన మంత్రి పాఠశాలకు వెంటనే మరమ్మతులు జరిపి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం మహిళ సమాజ్ ఆవరణ వద్దకు వచ్చిన మంత్రి మహిళ సమాజ్ ఆవరణను అభివృద్ధి చేయాలని సూచించారు. సరైన వేదిక రాకపోకలకు వీలుకలిగే ప్రధాన గేటుతో పాటు అక్కడ శిథిలావస్థకు చేరిన ప్రహరీలను పునరుద్ధరించాలన్నారు. అదే సమయంలో మహిళ సమాజ్ కాంప్లెక్స్ దుకాణదారులు వెనకభాగంలో ద్వారాలు ఏర్పాటు చేయడాన్ని గమనించిన మంత్రి వాటిని రద్దు చేయించాలని యజమానులకు సూచించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పబ్లిక్ గార్డన్ వద్దకు వెళ్లిన మంత్రి శౌచాలయాలను నిర్మించాలని సందర్శకులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. పూర్తి ఎండిపోయి విరిగిపడి ఉన్న చెట్లను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. అదే సమయంలో ఉన్న చెట్లకు కింద ఆసనాలు ఏర్పాటు చేసి సందర్శకులు కూర్చునేందుకు వీలు కల్పించాలన్నారు. అదే సమయంలో పాదచారులు తిరగేందుకు ఫుట్‌పాత్‌లు ఇతరత్ర సౌకర్యాలను అందుబాటులోకి తేవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి వెంట నగరసభ కమిషనర్ గురుసిద్దయ్య హిరేమఠ తదితరులున్నారు.



పబ్లిక్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న మంత్రి భోసరాజు

గ్రామీణ ప్రాంతాల్లో తగ్గని కోలాహలం

రాయచూరు, జనవరి 14 : మూడు రోజుల పాటు సాగే మకర సంక్రాంతి పర్వదినాన్ని నగర ప్రజలు ఆదివారం భోగి పండుగతో ప్రారంభించారు. తొలిరోజు భోగి పండుగగా జరుపుకునే ప్రజలు మకర సంక్రాంతి పుణ్యకాన్ని మకర సంక్రాంతిగా ఆచరించడం అనంతరం మూడవ రోజు కనమ పండుగగా జరుపుకోవడం ఆనవాయితి. తొలి రోజు భోగి పండుగను పురస్కరించుకుని నగరంలో వేకువ జాము నుంచే ప్రతి ఇళ్ల ముందు మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దుతు సందడి చేశారు. తెల్లారేలోగా నగరంలోని వీధులు వాడలు అన్ని చోట్ల వాడవాడల్లోను ఇళ్లముందు అందమైన రంగవల్లులు దర్శనమిచ్చాయి. కాగా రైతుల పండుగగా చెప్పుకునే మకర సంక్రాతి పండుగను గ్రామీణ ప్రాంతాల్లోను ప్రజలు ఉత్సహంగా జరుపుకున్నారు. తొలి రోజు పండుగ సందర్భంగా సజ్జల పిండితో నువ్వులు అద్దుతో చేసిన రొట్టెలను కూరగాయలతో పలిపి ఉన్న కలగూరతో కలిపి ఆరగించడం ఈ పండుగ ప్రత్యేకత.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

త్రిపురనేని రామస్వామి చౌదరి (జయంతి)



'కవిరాజు' బిరుదు పొందిన త్రిపురనేని రామస్వామి 1887 జనవరి 15న కృష్ణా జిల్లా అంగలూరులో జన్మించారు. న్యాయవాది, హేతువాద రచయిత, సంఘసంస్కర్త. తెలుగు కవిత్వం, సాహిత్యాలలో హేతువాదం, మానవతా వాదాన్ని తొలిసారిగా ప్రవేశపెట్టిన కవిగా భావిస్తారు. బ్రిటన్‌లో చదువుకునే రోజుల్లో తలపాగా ధరించి, పంచె కట్టుకునేవారు. ప్రజలను చైతన్యపరచడానికి సాహిత్యం మార్గంగా ఎంచుకున్నారు. మానవసేవే మాధవసేవగా భావించి ఆచరించారు. 1940లో గుడివాడ ప్రజలు ఆయనకు గజారోహణ సన్మానము చేశారు. 1943 జనవరి 16న కన్నుమూశారు.

మార్టిన్ లూథర్ కింగ్ (జయంతి)



నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ 1929 జనవరి 15న అమెరికా దేశం జార్జియా రాష్ట్రం అట్లాంటాలో జన్మించారు. తండ్రి బాటలో కొనసాగి మానవహక్కుల ఉద్యమానికి నాయకుడిగా వ్యవహరించారు. మహాత్మాగాంధీ స్ఫూర్తితో అహింసా మార్గంలో సాగారు. సదరన్ క్రిస్టియన్ లీడర్ షిప్ కాన్ఫరెన్స్‌కు తొలి అధ్యక్షుడిగా వ్యవహరించారు. బాప్టిస్ట్ మినిస్టర్‌గా వ్యవహరించారు. 1968 ఏప్రిల్ 4న హత్యకు గురయ్యారు.

మాయావతి (పుట్టినరోజు)



దేశంలోనే పెద్దదైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రిగా, తొలి మహిళగా ఎన్నికై రికార్డు సృష్టించిన మాయావతి 1956 జనవరి 15న న్యూఢిల్లీలో జన్మించారు. ఉత్తరప్రదేశ్‌కు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షురాలు. మూడుసార్లు లోక్‌సభకు, మరో మూడుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2003లో యూనిసెఫ్‌చే ఎపాల్ హ్యారిస్ ఫెలో అవార్డ్ అందుకున్నారు. 2008లో ఫోర్బ్స్ విడుదల చేసిన జాబితాలో వెయ్యిమంది ప్రభావవంత మహిళల్లో 59వ మహిళగా నిలిచారు. రాజర్షి షాహు మెమోరియల్ ట్రస్టుచే 'రాజర్షి షాహు'గా గౌరవం అందుకున్నారు.



షికారిపురలో ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర



మల్లేశ్వరంలో శుభ్రం చేస్తున్న మాజీ డీసీఎం డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ

రామమందిర నిర్మాణం.. భారతీయులందరి కల

● మాజీ డీసీఎం, మల్లేశ్వరం ఎమ్మెల్యే అశ్వత్థనారాయణ

బెంగళూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం దేశంలోని 140 కోట్ల మంది భారతీయుల ఆత్మాభిమాన ప్రతీక అని మాజీ ఉప ముఖ్యమంత్రి, మల్లేశ్వరం ఎమ్మెల్యే డా.సిఎన్.అశ్వత్థనారాయణ పేర్కొన్నారు. రామమందిర భవ్య స్వాగతంకోసం స్వచ్ఛతీర్థ అభియాన కార్యక్రమం బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. మల్లేశ్వరం 12వ వార్డులోని కోదండరామస్వామి ఆలయంలో రామభక్తులతో కలిసి ఆయన స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణాన్ని మొత్తం శుభ్రం చేశారు. కాగా బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు బివై.విజయేంద్ర శివమొగ్గ జిల్లా షికారిపురలోని హుచ్చురాయస్వామి ఆలయాన్ని శుభ్రం చేశారు. శాసనసభలో ప్రతి పక్ష నేత ఆర్.అశోక్ జయనగర్‌లోని గణేశ దేవస్థానంలో జరిగిన శుభ్రతా కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ నెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభం కానున్న వేళ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని హిందే ఆలయాలను శుభ్రం చేయాలని బీజేపీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. రామమందిరం అంశాన్ని తాము రాజకీయం చేయడం లేదని నిజానికి ప్రతిపక్షాలే దీన్ని రాజకీయం చేస్తున్నాయని బీజేపీ ఆరోపించింది. కాంగ్రెస్ ఇప్పటికైనా హిందువులపై కుతంత్రాలను మానుకోవాలని విమర్శించింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది.



బెంగళూరు జయనగర్‌లో ఆలయాన్ని శుభ్రం చేస్తున్న ప్రతిపక్ష నేత ఆర్ అశోక్

జయదేవ డైరెక్టర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బెంగళూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): జయదేవ హృద్రోగ ఆసుపత్రి డైరెక్టర్ హోదాను రెగ్యులర్ విధానంతో భర్తీ చేసేందుకు రాష్ట్ర వైద్యవిద్యా శాఖ దరఖాస్తులకు ఆహ్వానించింది. జయదేవ ఆసుపత్రుల డైరెక్టర్‌గా సుదీర్ఘకాలంగా డాక్టర్ సీఎన్ మంజునాథ్ వ్యవహరిస్తున్నారు. డైరెక్టర్ హోదాలో మంజునాథ్ సేవలకు రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రశంసలు అందాయి. మంజునాథ్ సేవలకుగాను కేంద్రప్రభుత్వం పద్మశ్రీ గౌరవంతో సత్కరించింది. దశాబ్దన్నర కాలంలో జయదేవ ద్వారా లక్షలాది మంది హృద్రోగులకు ఉత్తమమైన సేవలను మంజునాథ్ అందించారు. ఇప్పటికే పదవీవిరమణ చెందినా ఆయనను దాదాపు అన్ని పార్టీల ప్రభుత్వాలు కొనసాగించేందుకే మొగ్గు చూపాయి. జూలై 2023లో మంజునాథ్ పదవీకాలం పూర్తి కాగా సీఎం సిద్దరామయ్య ఆరునెలల పాటు సేవలను పొడిగించారు. ఈనెలతో గడువు ముగుస్తున్న తరుణంలో రెగ్యులర్ విధానంతో డైరెక్టర్‌ను నియమించేందుకు వైద్యవిద్యాశాఖ దరఖాస్తులు కోరింది. మరోవైపు మరింతకాలం మంజునాథ్‌ను డైరెక్టర్‌గా కొనసాగించాలని పలువురు మంత్రులు సిఫారసు చేస్తున్నట్లు తెలుస్తోంది.

17న ఇండియా- ఆఫ్ఘనిస్తాన్ టీ-20

బెంగళూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): భారత ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఈ నెల 17న టి-20 క్రికెట్ పోటీ జరుగనుంది. ఈ పోటీని వీక్షించేందుకు బెంగళూరునగర నలుమూలల నుండి క్రికెట్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రానుండటంతో ప్రత్యేక మెట్రో రైళ్ళతో పాటు బిఎంటిసి బస్సుల సేవలను కూడా పెంచనున్నారు. కాడుగోడి, సర్జాపుర, ఎలక్ట్రానిక్ సిటీ, బన్నేరుఘట్ట, కింగేరి, యలహంక, బాగలూరు. హోస్కోటె తదితర ప్రాంతాలకు ఆ రోజు అదనపు బస్సులను నడుపాలని నిర్ణయించినట్లు బీఎంటీసీ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. కాగా నమ్మమెట్రో షెడ్యూల్డ్ రైళ్ళతో పాటు అదనపు రైళ్ళను నడుపనుంది.

అనంతకుమార్ హెగ్డేపై సుమోటోగా కేసు నమోదు

బెంగళూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డేపై కుముటా పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. ఐపీసీ 505, 153ఏ సెక్షన్‌ల కింద ఆదివారం కేసులు నమోదు చేశారు. శనివారం కుముటా పట్టణంలో జరిగిన బీజేపీ కార్యాకర్తల సమావేశంలో ఎంపీ అనంతకుమార్ వివాదాస్పద వ్యాఖ్యలపై కేసులు నమోదు చేశారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు గోవధ నిషేధంపై భారీగా ఆందోళనలు జరిగాయని, పోలీసుల కాల్పుల్లో పదుల సంఖ్యలో సన్యాసులు మృతి చెందారన్నారు. ఇందిరాగాంధీ సమక్షంలోనే హత్యలు జరిగాయని, కొందరు జాతి, భాష, ప్రాంతీయతల పేరుతో సమాజాన్ని చీల్చే కుట్రపన్నుతున్నారన్నారు. కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత లేదని కానీ సీఎం సిద్దరామయ్య హిందుత్వ వ్యతిరేక విధానాలపై అభ్యంతరం ఉందన్నారు. ఇలా తీవ్రమైన వ్యాఖ్యలు చేశారనే కారణంతోనే పోలీసులు సుమోటోగా స్వీకరించి కేసులు నమోదు చేశారు. కాగా ఎంపీ వ్యాఖ్యలపై సీఎం సిద్దరామయ్య ఆదివారం ఎక్స్ వేదికగా స్పందించారు. కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని మార్పు చేస్తానని అనే వారి నుంచి ఇంకేమి నిరీక్షించగలమన్నారు. ఆయన పరుషమైన వ్యాఖ్యలు అతడి సంస్కృతికి నిదర్శనమన్నారు. కాగా బెంగళూరులో డీసీఎం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ ఎంపీలో ఏదో అయ్యిందని ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. కొంతకాలంగా ఆయన కనిపించకుండా విశ్రాంతిలో ఉండేవారని ఇప్పుడే వచ్చి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. చిక్కబళ్ళాపుర ఎమ్మెల్యే ప్రదీప్‌ఈశ్వర్ స్పందిస్తూ హిందూమతం మీ తండ్రి ఆస్తినా అంటూ విరుచుకుపడ్డారు. రాముడు, అంబేడ్కర్‌లు మా హృదయంలోను ఉన్నారన్నారు. రాముడు మీకు మాత్రమే దేవుడు కాదని అందరూ కొలుస్తారన్నారు. మాట్లాడేముందు నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

● సద్గురు సిద్ధేశ్వర్ బ్రహ్మర్షి గురుదేవ్



బెంగళూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): మతం ఏదైనా ఆధ్యాత్మికత విషయంలో సహమతం ఉందని మానసిక ప్రశాంతత పొందేందుకు సమస్త మానవాళికి ఇదొక దివ్యమైన సులభతరమైన మార్గమని సద్గురు సిద్ధేశ్వర బ్రహ్మర్షి గురుదేవ్ పేర్కొన్నారు. బెంగళూరు ప్యాలెస్ మైదానంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటైన ఆనంద్ మహోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులను ఉద్దేశించి స్వామీజీ ప్రసంగించారు. తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవమని, వారిని పూజించడం ద్వారా దేవున్ని ప్రసన్నం చేసుకోవచ్చని పిలుపునిచ్చారు. విశ్వ ధర్మ చే తన మంచ్ బెంగళూరు కేంద్రం ఆధ్వర్యంలో రాయల్ సెనేట్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి బెంగళూరు నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుం చి పె ద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. జీవితంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని ఇందుకు భగవంతుడి నిత్యఆరాధన బాగా ఉపయోగపడుతుందన్నారు. ధర్మం బాటలో నడిస్తే భగవంతుడు కూడా కరుణిస్తాడన్నారు. మానవ జీవితాన్ని సార్థకం చేసుకోవాలని స్వామిజీ హితవు పలికారు. భక్తులను ఉద్దేశించి ఆయన ఆధ్యాత్మిక బోధనలు చేశారు. హిందూ మతంలోని గొప్పతనాన్ని వివరించారు. పిల్లలకు భారతీయ సంస్కృతిని నేర్పాలన్నారు. రామాయణం.మహాభారతం, వంటి గ్రంధాలను సమయం దొరికినప్పుడల్లా పఠించాలన్నారు. నైతిక విలువలను అలవర్చుకోవాలని సూచించారు.

ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆవిర్భావం

బెంగళూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): చందన సీమ సంక్లిష్ట పరిస్థితిలో ఉందని అందుకే కన్నడ భాషలో ఇటీవల వెలువడుతున్న సినిమాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని సినీ పండితులు అంచనా వేస్తున్నారు. సినీరంగ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశలో కన్నడిగుడు హెచ్‌ఆర్.దిలీప్‌కుమార్ సారథ్యంలో ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ శాఖ ఆవిర్భవించింది. బెంగళూరులో ఈ సంస్థ కార్యాలయాన్ని నవశక్తి పీఠానికి చెందిన డా.భగవాన్ విష్ణుదత్త గురూజీతో పాటు ప్రముఖ నటుడు దర్శకుడు వి.మనోహర్, సాహితీవేత్త డా.వి.నాగేంద్రప్రసాద్‌లు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సంస్థ సేవలను చందనసీమ సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వీరు పిలుపునిచ్చారు. ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ (ఐఎఫ్ఎంఏ) ప్రధాన కార్యాలయం తెలంగాణాలో ఉంది. ఈ సంస్థకు 12 రాష్ట్రాలలో కలిసి మొత్తం 9 శాఖలు ఉన్నాయి. ఈ సంస్థలో సినీ నిర్మాతలు, దర్శకులు, కళాకారులు, సాంకేతిక విభాగానికి చెందిన వారు సభ్యులుగా చేరవచ్చునన్నారు. నిర్మించే సినిమాల ఆధారంగా నిర్మాతలకు బ్యాంకుల నుంచి రుణాలను మంజూరు చేయించడం, ఆయా వారాల్లో విడుదలయ్యే సినిమాలను ఎంపిక చేసి ఐదువేల టికెట్లను కొనుగోలు చేయించడం, ఒటిటి, డబ్బింగ్, ఆడియో, పంపిణీ హక్కుల విషయంలో నిర్మాతకు మార్గదర్శకత్వం వహించడం వంటి సేవలను అందిస్తామని సంస్థ వెల్లడించింది. కాగా తొలి ప్రయత్నంగా హోల్‌సేల్ బాస్కెట్స్ గ్రూప్ సహకారంతో మూకాంబికా రేషన్ కిట్, స్టార్ గోల్డ్ ఆధ్వర్యంలో సినీకళాకారులు, సాంకేతిక నిపుణులకు తక్కువ ధరకే నిత్యావసర వస్తువులను అందించే ప్రయత్నాన్ని చేపట్టామని సంస్థ నగరంలో ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.



ప్రారంభోత్సవంలో సినీ ప్రముఖులు

ఎమ్మెల్యే బసవరాజ కారు బోల్తా... స్వల్పగాయాలతో బయటపడిన వైనం

బెంగళూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): కలబురిగి గ్రామీణ బీజేపీ ఎమ్మెల్యే బసవరాజ మత్తిమడు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. కలబురిగి తాలూకా పాళా గ్రామంలో ఓ కార్యక్రమం ముగించి శెహబాద్‌లో మరో సభలో పాల్గొనేందుకు వెళుతుండగా రోడ్డు మలుపు వద్ద అదుపుతప్పి పంటపొలాలలోకి బోల్తాపడింది. ఒక్కసారిగా ఏమిజరిగిందో తెలుసుకునేసరికే కారు పొలాలో తిరిగిపడింది. వెంటనే గన్‌మెన్‌లతో పాటు ఇతరులు బయటకు రాగలిగారు. ఎమ్మెల్యేను బయటకు తీసుకువచ్చారు. ఎమ్మెల్యేకు చిన్నపాటి గాయాలు మాత్రమే కావడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. కారులోని వారే తీసిన వీడియో వైరల్ అయ్యింది. వెంటనే ఎమ్మెల్యేను మరోకారులో కలబురిగి పట్టణానికి తరలించి ఆసుపత్రిలో చేర్పించారు. ఎమ్మెల్యే భార్య జయశ్రీ, కుమారుడు ఆకాశ్‌లు ఆసుపత్రికి చేరుకుని ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. కలబురిగి యూనివర్శిటీ పోలీసుస్టేషన్ పరిధిలో ప్రమాదం జరిగింది.

పాన్ ఇండియా జాబితాలోకి వాతాపి

బెంగళూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): చందనసీమలో కొద్దికాలంగా పాన్‌ఇండియా చిత్రాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం గర్వకారణంగా చెప్పుకోవాలి. ఈ జాబితాలోకి తాజాగా వాతాపి సినిమా చేరింది. కన్నడతో సహా తెలుగు, తమిళ, మలయాళం, హిందీ, ఇంగ్లీష్, చైనీస్, జపనీస్ భాషల్లో రూపుదిద్దుకుంటున్న వాతాపి చందనసీమలో హాట్‌టాపిక్‌గా మారింది. శ్రీసూర్య చంద్ర కంబైన్స్, చందనవన ఛాయ చలన చిత్ర, సినీ కిరణ్ ప్రొడక్షన్స్ పతాకంపై శివపూర్ణ (లోకేష్), జికె.తిరుమలేష్, ముత్తురాజ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి క్షిప్ర ఫేం సతీష్ కృష్ణ కథను, సంభాషణలను అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా పోస్టర్‌ను నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి లాంఛనంగా ఆవిష్కరించారు. థ్రిల్లర్‌తో కూడిన పురాణ కాలం నాటి కథతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. చిత్ర తారాగణంలో రాజీవ్‌రాథోడ్, పల్లవి ప్రకాష్, రాబర్ట్, జికె.తిరుమలేష్, కస్తూరి, రఫీక్, మంజేష్‌గౌడ, చైత్రా, భాను, శృతి, బేబీ ఆరాధ్య తదితరులున్నారని దర్శకుడు సతీష్ కృష్ణ నగరంలో ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఈ చిత్రానికి లెజండరీ సంగీత దర్శకుడు ఈ సినిమాకు సంగీతాన్ని అందించనున్నారు. ప్రస్తుతానికి ఈ పేరును సస్పెన్స్‌లో ఉంచారు. తెలుగులో బాహుబలి వంటి బ్లాక్‌బస్టర్ వంటి సినిమాలకు కెమెరామెన్‌గా వ్యవహరించిన ప్రసాద్ పులిచర్ల ఈ సినిమాకు కెమెరామెన్‌గా ఎంపికయ్యారన్నారు. కన్నడ భాషలో తొలిసారి ఆయన కెమెరామెన్‌గా పనిచేస్తుండం మరో విశేషం. వాతాపి సినిమా చిత్రీకరణ సకలేశ్‌పుర, నందిబెట్ట, నెలమంగళ, రామోజి ఫిలింసిటీలతో జరుగనుంది. వచ్చే నెల ఈ సినిమా ముహూర్త సన్నివేశాల చిత్రీకరణ ఉంటుందని దర్శకుడు వెల్లడించారు.



వాతాపి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి

రూ.3,935 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్

బెంగళూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ 3,935 కోట్ల మేరకు పెట్టుబడుల ప్రతిపాదనలకు హైలెవల్ సింగిల్ విండో కమిటీ పచ్చజెండా చూపింది. ఈ విషయాన్ని భారీ పరిశ్రమల శాఖా మంత్రి ఎంబీ పాటిల్ బెంగళూరులో శనివారం మీడియాకు వెల్లడించారు. గ్రీన్‌సిగ్నల్ లభించిన వాటిలో రూ 50 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 10 ప్రాజెక్టులున్నాయన్నారు. రూ.15 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు పెట్టుబడి ప్రతిపాదనలకు సంబంధించిన 59 ప్రాజెక్టులున్నాయన్నారు. మొత్తం 73 ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి రూ 3,935 కోట్లు తరలి రానున్నాయని దరిమిలా 14,497 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయన్నారు. రాష్ట్రంలోని దేవనహళ్ళి, శిరా పారిశ్రామిక వాడ, హూవిన హడగలి, రామనగర, కడెచూరు, చామరాజనగర, గౌరీబిదనూరు, వసంతనరసాపుర ప్రాంతాల్లో ఈ ప్రాజెక్టులు ఒప్పందం ప్రకారం నిర్ణీత అవధిలో ప్రారంభం కానున్నాయని మంత్రి ప్రకటనలో తెలిపారు.

చాక్లెట్ కవర్‌లో రూ.7.76 కోట్ల వజ్రాలు

బెంగళూరు ఎయిర్‌పోర్టులో పట్టుబడ్డ వైనం

బెంగళూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి దుబైకి అక్రమంగా రవాణా చేస్తున్న రూ.7.76 కోట్ల విలువైన వజ్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రూ.4.62 లక్షల విలువైన అమెరికన్ డాలర్‌లు, దిర్‌హం కరెన్సీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా వజ్రాలను తరలిస్తున్న ఇద్దరు చిక్కబళ్ళాపురం వాసులను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ అధికారులు ఈనెల 10న బుధవారం అరెస్టు చేశారు. ముంబై నుంచి బెంగళూరుకు వజ్రాలను చాకొలెట్ డబ్బాలలో ప్యాక్‌చేసి రవణా చేసేందుకు ప్రయత్నించారు. వైమానిక విభాగం ఇంఇంటలిజెన్స్ అధికారులకు సమాచారం రావడంతో అప్రమత్తమయ్యారు. రన్ వేపై దుబైకు బయలుదేరేందుకు సిద్దంగా ఉండే విమానంలో అధికారులు సోదాలు జరుపగా ప్రయాణీకుల లగేజీ బ్యాగులలో వజ్రాలను గుర్తించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపగా హైదరాబాద్ నుంచి మరో ఇద్దరు వజ్రాలను దుబైకు తరలించేందుకు ప్రయత్నిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. అదే రోజున హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.6.03 కోట్ల విలువైన వజ్రాలు, రూ. 9.83 లక్షల అమెరికా డాలర్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఒకే రోజున రెండు ఎయిర్‌పోర్టుల నుంచి వజ్రాలను దుబైకు ఎగుమతి జరిగిన విషయమై డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటలిజెన్స్ అధికారులు సమగ్ర దర్యాప్తు జరుపుతున్నట్లు శనివారం ప్రకటించారు.

డీసీఎం కావాలంటే పరీక్షలు పెట్టాల్సిందే: ఎమ్మెల్యే

బెంగళూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పదవులను ఆశిస్తున్న నేతలకు అధిష్టానం పెద్దలు పరీక్షలు పెడితే మంచిదని అందులో విజయం సాధించిన వారికి ఈ పదవులు అప్పగిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదని కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్.సి.బాలకృష్ణ అభిప్రాయపడ్డారు. రామనగరం జిల్లాలోని మాగడిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కనీసం రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆపై డీసీఎం పదవును కోరాలని ఆయన నేతలకు సూచించారు. పార్టీని, ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే పనికి పూనుకోవద్దని సొంత పార్టీ నేతలకు విజ్ఞప్తిచేశారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ రాముణ్ణి రాజకీయాల్లోకి లాగుతోందని వ్యాఖ్యానించారు. తామే హిందువులన్నట్లు విర్రవీగుతున్నారని ఇది సరికాదన్నారు. హిందువుల్లో చీలికలు తెచ్చి ఆ పాపాన్ని మూటగట్టుకోవద్దని హితవు పలికారు. తామూ హిందువులమేనని తమదీ హిందూ రక్తమేనని వ్యాఖ్యానించారు. కాగా ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ఏకవచనంలో సంస్కారహీనంగా వ్యాఖ్యలు చేసిన ఎంపీ అనంతకుమార్ హెగ్డేపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఇలాంటి సం స్కార హీనుల వ్యాఖ్యలను ప్రజలతో పాటు సొంత పార్టీ నేతలే తీవ్రంగా అసహ్యించుకుంటున్నారన్నారు.



మయూరం.. వయ్యారం

● లాల్‌బాగ్‌లో పూల సోయగాల ప్రదర్శనకు సిద్ధం

బెంగళూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్‌డేను పురస్కరించుకుని లాల్‌బాగ్ ఉద్యానవనంలో పూలసోయగానికి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. క్రాంతికార బసవణ్ణ అనుభవం మంటపం ఐక్యకేంద్రం రూపంతో గ్లాస్‌హౌస్‌లో పూల ప్రదర్శన ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు రంగురంగుల పూల నెమలితో పాటు పలు పూలఖండాలు సిద్దమయ్యాయి. మంగళవారం ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభం కానుంది.

ఆకట్టుకుంటున్న పూల నెమలి ఇలా

నేడు ప్రధాని మోదీ రాక

హిందూపురం, జనవరి 14: శ్రీసత్యసాయి జిల్లా పాలసముద్రం వద్ద నాసిన్ కేంద్రాన్ని ఈనెల 16న భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. పర్యటన ఏర్పాట్లపై ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ నాసిన్ కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటనలో ఏలోట్లు లేకుండా చూడాలన్నారు. హెలిప్యాడ్, సభావేదిక, ప్రధాని ప్రారంభించే భవనాలు, పర్యటించే మార్గాలను పరిశీలించి స్థానిక అధికారులకు సూచనలు ఇచ్చారు. ప్రధాని పర్యటనలో ఎలాంటి అపశ్రుతులు జరగరాదని, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తికావాలని, అన్ని శాఖలు సమన్వయంతో సాగాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జేసీ వెంట జిల్లా అధి కారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.